క్లుప్తంగా

లా కళాశాలలో అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు

కాజీపేట: కాజీపేట మహాత్మా జ్యోతిబాపూలే మహిళా గురుకుల న్యాయ కళాశాలలో లా అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ఎల్ఎంలో కనీసం 55 శాతం మార్కులు కలిగిన మహిళా అభ్యర్థులు ఈ పోస్టుకు అర్హులని పేర్కొన్నారు. లా లో పీహెచ్‌డీ, నెట్, సెట్‌తో పాటు పూర్వ అనుభవం ఉన్న అభ్యర్థులు సెప్టెంబర్ 5వ తేదీలోపు ఆఫ్‌లైన్‌లో లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

న్యూశాయంపేట: హనుమకొండ జిల్లా పరిధి ములుగురోడ్డు పెద్దమ్మగడ్డ వద్ద ఉన్న మైనార్టీ బాలుర గురుకులంలో ఖాళీగా ఉన్న (నాన్ మైనార్టీ కోటా) సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ అన్నపూర్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో బీసీ (1), ఎస్సీ (1), ఎస్టీ (1), ఓసీ (2), 6వ తరగతిలో ఎస్టీ (1), ఓసీ (1) సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆదివారం దరఖాస్తు చేసుకోవాలని, మరుసటి రోజు లక్కీడిప్ ద్వారా సీట్లు కేటాయిస్తామని ఆమె వివరించారు.

విద్యార్థులకు ఉద్యోగ మేళా

విద్యారణ్యపురి: హనుమకొండలోని ఐసీఎస్ఎస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్‌లో వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని ఇంటర్ పూర్తిచేసుకున్న విద్యార్థులకు శనివారం ఉద్యోగ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించి, ఇంటర్వ్యూ చేశారు. ఈ ప్రక్రియను వరంగల్ డీఐఈఓ డాక్టర్ శ్రీధర్‌సుమన్ పరిశీలించారు.

కాంగ్రెస్ సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్‌గా రోషన్ గైక్వాడ్



హన్మకొండ చౌరస్తా: కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్‌గా హనుమకొండకు చెందిన రోషన్ గైక్వాడ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఇండియన్ యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా అధ్యక్షుడు మంజుజైన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

మొబైల్ ఫోన్ అప్పగింత


వరంగల్ చౌరస్తా: వరంగల్ హెడ్ పోస్టాఫీస్ సెంటర్‌లో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న హోంగార్డు అమీన్‌కు శనివారం సాయంత్రం మొబైల్ ఫోన్ దొరికింది. ఈ మేరకు బాధితుడికి ఆ ఫోన్‌ను హోంగార్డ్ అందజేశారు.

నైపుణ్యాలు పెంచుకోవాలి



విద్యారణ్యపురి: విద్యార్థినులు నైపుణ్యాలు పెంచుకోవాలని హనుమకొండ ప్రభుత్వ పింగిళి మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రమౌళి అన్నారు. కళాశాలలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థినులకు ఆన్ ది జాబ్ ట్రెనింగ్ ప్రోగ్రాంను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశ్రమలల్లో వస్తున్న మార్పులపై క్రిస్ప్ కంపెనీ ప్రాజెక్టు లీడర్ నగేష్, మానిటరింగ్ మేనేజర్ భాస్కర్ తివారి వివరించారు. కార్యక్రమంలో బీబీఏ కోఆర్డినేటర్ డాక్టర్ సుమలత, డాక్టర్ రాజిరెడ్డి, సమత, సురేష్ పాల్గొన్నారు.

ఎడ్ల బండిపై విగ్రహం ఊరేగింపు



ఖిలా వరంగల్: గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేష్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన విఘ్నేశ్వరుడిని శనివారం నిమజ్జనం చేశారు. మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ నుంచి ఉర్సు గుట్ట చెరువు వరకు ఎడ్ల బండిపై విగ్రహాన్ని ఊరేగించి నిమజ్జనం చేశారు.

పరిసరాలను కలుషితం చేయొద్దు



హన్మకొండ: ప్రజలు వీధుల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త పడేసి పరిసరాలను కలుషితం చేయొద్దని, ఇంటి వద్దకే వచ్చే చెత్త సేకరణ వాహన డ్రైవర్‌కు వ్యర్థాలు అందించాలని 59వ డివిజన్ కార్పొరేటర్ గుజ్జుల వసంత సూచించారు. హనుమకొండ వికాస్‌నగర్ – భవానినగర్ కూడలిలో తడి, పొడి చెత్తపై శనివారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేరే చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలన్నారు. ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ బ్యాగుల వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని పేర్కొన్నారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందని వసంత గుర్తుచేశారు. కార్యక్రమంలో బీజేపీ హనుమకొండ జిల్లా కార్యదర్శి గుజ్జుల మహేందర్ రెడ్డి, భవానినగర్, వికాస్‌నగర్ వాసులు పాల్గొన్నారు.

ఇరుకు వంతెనపై ఇక్కట్లు

- నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం
- చింతగట్టు క్యాంపు బ్రిడ్జి విస్తరించాలని వాహనదారుల వేడుకోలు

హసన్‌పర్తి: హనుమకొండ – కరీంనగర్ ప్రధాన రహదారి మార్గమధ్యలోని చింతగట్టు క్యాంపు వద్ద ఉన్న వంతెన ఇరుకుగా ఉంది. ప్రస్తుత వాహనాల రద్దీకి అనుగుణంగా బ్రిడ్జిని విస్తరించాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై పాలకులు, అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వారు తెలిపారు.

1980లో నిర్మాణం

ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ పనుల సందర్భంగా 1980లో కాల్వపై బ్రిడ్జిని నిర్మించారు. రానున్న 30 ఏళ్ల జనాభాను దృష్టిలో పెట్టుకుని ఆ వంతెనను అప్పుడు నిర్మించారు. ప్రస్తుతం జాతీయ రహదారిగా మారగా, వేలాది వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ క్రమంలో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. వంతెనపై చిన్న సమస్య ఏర్పడినా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ఈ క్రమంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలంటే ఎక్కువ సమయం పడుతోందని ట్రాఫిక్ అధికారులు చెబుతున్నారు.



చింతగట్టు క్యాంపు వంతెన

రాత్రి వేళల్లో ప్రమాదాలు



చింతగట్టు క్యాంపు సమీపంలోని వంతెన వద్ద రాత్రివేళల్లో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్నిసార్లు కాల్వలోకి వాహనాలు దూసుకెళ్లిన సంఘటనలూ ఉన్నాయి.

– జన్ను కిషన్, ఆటో డ్రైవర్

బ్రిడ్జిని విస్తరించాలి



చింతగట్టు బ్రిడ్జిని విస్తరించాలి. ప్రస్తుతం రాకపోకలకు అనుగుణంగా వంతెన నిర్మాణాన్ని చేపట్టాలి.

– అటికం రవీందర్, భీమారం

మోదీ, ఆయన తల్లిపై వ్యాఖ్యలు సిగ్గుచేటు



వరంగల్ చౌరస్తా: మాట్లాడుతున్న రవికుమార్



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

వరంగల్ చౌరస్తా: దేశ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న భారత ప్రధాని నరేంద్ర మోదీని అకారణంగా దూషించడమే కాకుండా ఆయన తల్లిపై కూడా అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ధ్వజమెత్తారు. ఈ మేరకు వరంగల్ చౌరస్తాలో మహిళా మోర్చా ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను శనివారం దహనం చేశారు. కార్యక్రమంలో జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు కాసు శిల్ప, మహిళా మోర్చా నాయకురాళ్లు పిట్టల సరస్వతి, మార్త ఉషారాణి, స్వర్ణ, రాజేశ్వరి, ఉమాదేవి, స్వరూప, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రత్నం సతీష్, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బన్న ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, జిల్లా ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్ కుమార్, ఎరుకుల రఘునారెడ్డి, గడల కుమార్, ఆనంద్, జిల్లా కోశాధికారి కూచన క్రాంతి, ప్రచార కార్యదర్శి బైరి శ్యాంసుదర్, తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం

హన్మకొండ చౌరస్తా: ప్రధాని నరేంద్రమోదీ తల్లిపై ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ హనుమకొండ చౌరస్తాలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు శనివారం దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ దేశాభివృద్ధి, ప్రజా సమస్యలపై స్పష్టత లేని నాయకుడు.. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం సరైంది కాదన్నారు. రాహుల్‌గాంధీ తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బైరి శ్రవణ్, సంద్ర మధు, సిరికొండ కవిత తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజం



వరంగల్ అర్బన్: యూసుపొద్దీన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న మేయర్, కమిషనర్, తదితరులు



సమ్మయ్యను సన్మానిస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్, కలెక్టరేట్ అధికారులు, ఉద్యోగులు

వరంగల్ అర్బన్: ప్రతీ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని నగర మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్‌పేయ్ అన్నారు. ఆర్ఓ యూసుపొద్దీన్ ఉద్యోగ విరమణ కార్యక్రమం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో బల్దియా జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో శనివారం జరిగింది. అడిషనల్ కమిషనర్ చంద్రశేఖర్, డీఎఫ్ఓ శంకర్ లింగం, ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్న రాణి, రవీందర్, సమ్మయ్య, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, హెచ్ఓ లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

సమ్మయ్య సేవలు అభినందనీయం

హన్మకొండ అర్బన్: ఉద్యోగ జీవితంలో సమ్మయ్య అందించిన సేవలు అభినందనీయమని హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ ప్రశంసించారు. కలెక్టరేట్ సూపరింటెండెంట్ దేవులపల్లి సమ్మయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమం శనివారం జరిగింది. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, డీఆర్వో వైవీ.గణేష్, తదితరులు పాల్గొన్నారు.

కుడా ఏఓ సత్యనారాయణ పదవీ విరమణ

నయీంనగర్: ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ సహజం అని కుడా వైస్ చైర్‌పర్సన్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. కుడా ఏఓ జి.సత్యనారాయణ పదవీ విరమణ కార్యక్రమం కుడా మీటింగ్ హాల్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించారు.

కబడ్డీ, ఖోఖో పోటీలు



కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

వరంగల్ స్పోర్ట్స్: మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి ఉత్సవాల్లో భాగంగా హనుమకొండ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో కబడ్డీ, ఖోఖో పోటీలను శనివారం నిర్వహించారు. ఈ పోటీలను డీఎస్ఏ జిమ్నాస్టిక్ కోచ్ నరేందర్ ప్రారంభించి మాట్లాడారు. వారం రోజుల పాటు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. అందులో భాగంగా ఆదివారం ఉదయం సైక్లింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కేఎంసీలో సైకిల్ క్లబ్ ప్రారంభం



సైకిల్ క్లబ్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ సంధ్య

రామన్నపేట: కాకతీయ మెడికల్ కళాశాల లేడీస్ హాస్టల్‌లో సైకిల్ క్లబ్ కార్యక్రమాన్ని కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్య శనివారం ప్రారంభించి మాట్లాడారు. కాలుష్య నియంత్రణ, శారీరక దృఢత్వం, ఆరోగ్యవంతమైన జీవనశైలిని ప్రోత్సహించడం కోసం 30 సైకిళ్లను కేటాయించినట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం సైకిళ్లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో లేడీస్ హాస్టల్ వార్డెన్ డాక్టర్ కత్యాని, డాక్టర్ శశికాంత్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిమజ్జన ప్రదేశాలను శుభ్రం చేయాలి



ఉర్సు చెరువును పరిశీలిస్తున్న రాజారెడ్డి

ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సు చెరువును కార్పొరేటర్ మరుపల్లి రవితో కలిసి బల్దియా ఎంహెచ్ఓ రాజారెడ్డి శనివారం సందర్శించారు. చెరువు వద్ద వినాయక విగ్రహాల నిమజ్జన స్థలాన్ని పరిశీలించారు. పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు, ప్లాస్టిక్ బాటిళ్లను తొలగించి. ఆ ప్రదేశాన్ని శుభ్రం చేయాలని శానిటరీ జవాన్లు ఆదేశించారు. సూపర్‌వైజర్లు భాస్కర్, శ్రీను, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజు, జవాన్లు కృష్ణ, కిరణ్ పాల్గొన్నారు.

విగ్రహాల నిమజ్జన స్థలాల పరిశీలన

మడికొండ: మడికొండ పోలీసు స్టేషన్ పరిధిలోని వినాయక విగ్రహాల నిమజ్జన ప్రాంతాలను 46వ డివిజన్ కార్పొరేటర్ మునిగాల సరోజన, మడికొండ ఇన్‌స్పెక్టర్ కిషన్, మున్సిపల్ సిబ్బంది శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్సై రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థి దాతృత్వం అభినందనీయం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల పూర్వ విద్యార్థి జె.రాజమౌళి దాతృత్వం అభినందనీయమని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి ప్రశంసించారు. హైదరాబాద్‌లోని యూరో మెడికల్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ రాజమౌళి కేయూలోని ఆరోగ్య కేంద్రానికి రూ.2 లక్షల 56 వేల విలువైన ఔషధాలను ఫార్మసీ కళాశాల డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య ద్వారా శనివారం అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం మెంబర్ ఇన్‌చార్జ్ ప్రొఫెసర్ ఎస్.ప్రసాద్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



రాజమౌళి అందజేసిన ఔషధాలతో వీసీ, రిజిస్ట్రార్

మహిళా అభివృద్ధే దేశాభివృద్ధి



ఎంపీని సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

హసన్‌పర్తి: మహిళలు అభివృద్ధి చెందినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. గీతాంజలి మహిళా డిగ్రీ కళాశాల ఉమెన్స్ ఎంపవర్‌మెంట్ కార్యక్రమం నగరంలోని ఎంటీఆర్ గార్డెన్‌లో శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఎంపీ కావ్యను కళాశాల యాజమాన్యం సన్మానించింది. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు వేణుమాధవ్, బి.శ్రీధర్, రాజుయాదవ్, లక్ష్మీకాంతరావు, సురేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఔషధ మొక్కలపై అవగాహన అవసరం

హన్మకొండ: ఔషధ మొక్కలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ అనిశెట్టి శ్రీధర్, కాకతీయ విశ్వవిద్యాలయ వృక్ష శాస్త్ర రిటైర్డ్ ప్రొఫెసర్ రాంరెడ్డి అన్నారు. హనుమకొండ నయీంనగర్‌లోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాలలో ఔషధ మొక్కల ప్రదర్శన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 35 గ్రూపుల విద్యార్థులు 175 జాతుల ఔషధ మొక్కలను ప్రదర్శించారు. డాక్టర్ అనిశెట్టి శ్రీధర్, రాంరెడ్డితో పాటు హనుమకొండ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయ డీఎస్ఓ శ్రీనివాసస్వామి న్యాయ నిర్ణేతలుగా వ్యవహించి గ్రూపుల వారీగా ఔషధ మొక్కలు పరిశీలించారు. కార్యక్రమంలో వాగ్దేవి విద్యాసంస్థల కరస్పాండెంట్ సీహెచ్.దేవేందర్ రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ వాహిని దేవి, ప్రిన్సిపాల్ డాక్టర్ శేషాచలం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరేందర్ రెడ్డి, వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సుతారి సతీష్, అధ్యాపకులు డాక్టర్ శ్రీరాములు, కవిత, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.



ఔషధ మొక్కలను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

అదనపు న్యాయమూర్తి శైలజకు శుభాకాంక్షలు



శైలజకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రైల్వే సిబ్బంది

కాజీపేట రూరల్: పరకాల జూనియర్ సివిల్ కోర్టు అదనపు న్యాయమూర్తి శ్రీవల్లి శైలజను కాజీపేట రైల్వే పర్సనల్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది కాజీపేట రైల్వే గెస్ట్‌హౌజ్‌లో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే పర్సనల్ బ్రాంచ్ అధికారిగా విధులు నిర్వహించిన జి.లక్ష్మిసురేఖ కుమార్తె శ్రీవల్లి శైలజ.. ఇటీవల పరకాల జూనియర్ సివిల్ కోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. కార్యక్రమంలో రైల్వే పర్సనల్ స్టాఫ్ చీఫ్ ఆఫీస్ సూపరింటెండెంట్ యాష్‌పాల్, ఆఫీస్ సూపరింటెండెంట్లు వస్కుల రవీందర్, పొన్నాల సురేష్‌బాబు, దేవర సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

4న 'మిలాద్ ఉన్ నబీ'



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కమిటీ బాధ్యులు

హన్మకొండ చౌరస్తా: మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలను (జష్న్ ఏ మిలాద్ ఉన్ నబీ) సెప్టెంబర్ 4వ తేదీన నిర్వహించనున్నట్లు మర్కజీ మిలాద్ కమిటీ ప్రెసిడెంట్ ఖాజా సిరాజుద్దీన్ తెలిపారు. ఈ మేరకు రాయపురలోని కమిటీ కార్యాలయంలో వేడుకల వాల్‌పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమకొండ రాయపురలోని జక్రియా ఫంక్షన్ హాల్‌లో వచ్చేనెల 4న రాత్రి 9గంటలకు ఉత్సవాలు జరుగుతాయని అన్నారు. వేడుకల్లో లక్కీడ్రా ద్వారా ఎంపికయ్యే ఇద్దరికి ఉమ్రా టికెట్లు అందజేయనున్నట్లు తెలిపారు. ఖురాన్ కంఠతా పూర్తి చేసిన నలుగురు విద్యార్థుల స్నాతకోత్సవం, విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నట్లు సిరాజుద్దీన్ వివరించారు.

ప్రజల సమస్యలు పరిష్కరించాలి

హసన్‌పర్తి: 65వ డివిజన్ చింతగట్టులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఐ(ఎం) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు చింతగట్టు ఏరియాను శనివారం సందర్శించి అక్కడ నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రెయినేజీలు అధ్వానంగా ఉన్నాయని, దోమల బెడదతో స్థానికులు జ్వరాల బారిన పడుతున్నట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి గుమ్మడి రాములు, నాయకులు పుల్లా అశోక్, లలిత, సారయ్య, పావని, పూలమ్మ, అనిత పాల్గొన్నారు.



డ్రెయినేజీని పరిశీలిస్తున్న నాయకులు

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

ఖిలా వరంగల్: అర్హులైన నిరుపేదలకు పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీపీఎం నాయకుడు ధర్మారపు సాంబమూర్తి కోరారు. 43వ డివిజన్ తిమ్మాపురం, జక్కలొద్ది గ్రామాల్లో పార్టీ రంగశాయిపేట ఏరియా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సమస్యలపై శనివారం ఇంటింటి సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో తాటిపాముల ఉదయశ్రీ, ఇసంపల్లి మంజుల, స్వాతి, రజియా, షమీనా, నలిగంటి రజిని, తోట మల్లయ్య, తోట రాజు, బందెల కృష్ణ, శివ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

పేద కుటుంబాలకు అండగా ఉంటాం

రామన్నపేట: పేద కుటుంబాలకు అండగా ఉంటూ, అభాగ్యులకు ఆపన్న హస్తం అందిస్తామని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ పేర్కొన్నారు. పశ్చిమ నియోజకవర్గం 29వ డివిజన్ రామన్నపేట రఘునాథ్‌కాలనీలో సూరి – హైమావతి దంపతుల ఇల్లు శుక్రవారం సాయంత్రం షార్ట్ సర్క్యూట్ కారణంగా కాలిపోయింది. దాంతో బాధిత కుటుంబాన్ని వినయ్‌భాస్కర్ శనివారం పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ప్రభుత్వం, కార్పొరేషన్ అధికారులు తక్షణమే స్పందించి రూ.2 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కొడకండ్ల సదాంత్, నాయకులు షఫీ, రాము, శేఖర్, జగన్, రమేష్, క్రాంతి, చందు, రాజు, భీమరాజు, రెహమాన్, రాజేష్, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

విద్యారణ్యపురి: ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని టీఎన్‌జీఓ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, జిల్లా జేఏసీ చైర్మన్ రాజేందర్ డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా నిరసనకు సంబంధించిన వాల్‌పోస్టర్లను హనుమకొండ జిల్లా విద్యాశాఖాధి కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ జంక్షన్ నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకు ఉద్యోగులతో ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో విద్యాశాఖ ఫోరం అధ్యక్షుడు భరత్, రాష్ట్ర ఫోరం కార్యదర్శి ఫక్రుద్దీన్, జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, జేఏసీ బాధ్యులు సంపత్‌రావు, టీఎన్‌జీఓ అసోసియేట్ అధ్యక్షుడు వేణుగోపాల్ పాల్గొన్నారు.

బీసీ ఉద్యమ సాహిత్య పుస్తకం ఆవిష్కరణ

కేయూ క్యాంపస్: ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని తెలుగు విభాగం అధ్యాపకుడు డాక్టర్ చింతం ప్రవీణ్ కుమార్ రచించిన సోయి బీసీ ఉద్యమ సాహిత్య పుస్తకాన్ని బీసీ టీచర్స్ బాధ్యులు కేయూలోని లైబ్రరీ ఆవరణలో శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కృష్ణయ్య, జనరల్ సెక్రటరీ ఎర్రబొజ్జు రమేష్, బీసీ సెల్ డైరెక్టర్ డాక్టర్ బొడిగ సతీష్, సుమంత్, మోహన్, నాగయ్య, ఉమాశంకర్, శ్యామ్ సుంచారాచారి, మహేందర్, కుమార్, శ్రీకాంత్‌యాదవ్, శ్రీనివాస్, శ్రీధర్, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

అరుదైన హెచ్ఎల్‌హెచ్ వ్యాధి గుర్తింపు

కాజీపేట అర్బన్: హంటర్‌రోడ్డులోని మెడికవర్ ఆస్పత్రిలో నగరానికి చెందిన 26 ఏళ్ల మహిళకు హెచ్ఎల్‌హెచ్ (హీమోఫాగోసిటిక్ లింఫోహిస్టియోసైటోసిస్) వ్యాధిని గుర్తించి అరుదైన చికిత్సను విజయవంతంగా పూర్తిచేశారు. ఆస్పత్రిలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ అండ్ హెపటాలజిస్ట్ కన్సల్టెంట్ డాక్టర్ వెంకటేశ్వర్‌రావు వివరాలు వెల్లడించారు. ఓ మహిళ రెండు వారాలుగా తీవ్ర జ్వరం, బలహీనత, కడుపునొప్పి, శ్వాసకోశ సమస్యలతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరగా, ఆమెకు వివిధ వైద్య పరీక్షలు చేసి హెచ్ఎల్‌హెచ్‌గా గుర్తించి చికిత్స అందించినట్లు వెంకటేశ్వర్‌రావు వివరించారు.

బీసీ అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి

కేయూ క్యాంపస్: బీసీ అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని కాకతీయ యూనివర్సిటీ బీసీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ గడ్డం కృష్ణయ్య కోరారు. ఇటీవల ఎన్నికైన కేయూ బీసీ టీచర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు శనివారం వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రంను మర్యాదపూర్వకంగా కలిశారు. అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎర్రబొజ్జు రమేష్, బాధ్యులు ఉమాశంకర్, శ్యామ్, సుందరాచారి, తిరుణహరి శేషు, శ్రీకాంత్ యాదవ్, బ్రహ్మయ్య, గోపి, లక్ష్మీనారాయణ, శ్రీధర్, ఉషాకిరణ్మయి, రాధిక, శ్రీనివాస్, సాంబశివరావు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలి

విద్యారణ్యపురి: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 2న చేపట్టిన చలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ పిలుపునిచ్చారు. హనుమకొండలోని కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బీరెడ్డి జస్వంత్, బాధ్యులు మల్లేష్, పవన్‌కుమార్, రాహుల్, ప్రశాంత్, సందీప్, రాజ్‌కుమార్, సాగర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఉర్సు దర్గా హవేలి పనులు పూర్తి

ఖిలా వరంగల్: వరంగల్ కరీమాబాద్‌లోని ఉర్సు దర్గా కమాల్‌పాషా హవేలి పనులు ఇటీవల పూర్తయ్యాయి. హజ్రత్ సయ్యద్ షా యాహియా పాషా నబీరా ఖాద్రీ సాహెబ్ ఆహ్వానం మేరకు హవేలిని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 5న హవేలిలో జరగనున్న మిలాద్ ఉన్ నబీ వేడుకలకు రావాలని ఆయనకు నబీరా ఖాద్రీ సాహెబ్ ఆహ్వాన కార్డును అందజేశారు.

శ్వేతార్క ఆలయంలో ప్రత్యేక పూజలు

కాజీపేట: బ్రహ్మోత్సవాల్లో భాగంగా కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో శనివారం సూర్య నమస్కార పూజలు, కేరళ పద్ధతిలో తాంత్రిక పూజలు నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయినవోలు రాధాకృష్ణ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక అర్చన, అభిషేకాలు చేశారు. గొలనుకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో తాంత్రిక పూజలు జరిపించారు. ఉత్సవ కార్యక్రమాల ఇన్‌చార్జ్‌లు శ్రీనివాస్, భాస్కర్ రావు, రమాదేవి, సులోచన, సుజాత, తారాబాయి, జయమ్మ, భాగ్యలక్ష్మి, వెంకటలక్ష్మి, ఉమాదేవి పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి

ఖిలా వరంగల్: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ సూచించారు. వన మహోత్సవంలో భాగంగా వరంగల్ తూర్పుకోటలోని శ్మశాన వాటికలో బల్దియా ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. చందర్, రాంబాబు, ప్రతాప్, సారంగపాణి, రమేష్, రాజు, నరేష్, వేణు, ప్రసాద్ పాల్గొన్నారు.

సమాచార హక్కుపై అవగాహన అవసరం

వరంగల్ చౌరస్తా: సమాచార హక్కుపై ప్రతీఒక్కరికి కనీసం అవగాహన ఉండాలని చైతన్య సమితి రాష్ట్ర కన్వీనర్ సాదుల పూర్ణచందర్ అన్నారు. వరంగల్ కాశిబుగ్గలో సమాచార హక్కు చైతన్య సమితి అవగాహన సదస్సును చిమ్మని లత అధ్యక్షతన శనివారం నిర్వహించారు. సదస్సులో నాయకులు బుద్దారపు సాంబయ్య, శ్రీరామ్ మల్లేశం, గుటోజు వేణు, మల్లిపెద్ది సునీత, శ్రీరామ్ పద్మ, ఓని రజిత, గౌతమి, లావణ్య, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

వరద తాకిడికి కూలిన ప్రహరీ

హన్మకొండ: ఇటీవల కురిసిన భారీ వర్షానికి హనుమకొండ అశోక కాలనీలోని తన ఇంటి ప్రహరీ కూలి ఆస్తి నష్టం కలిగిందని బాధితుడు కొట్టె ప్రవీణ్ వాపోయాడు. తన ఇంటి పక్కన ఖాళీ స్థలంలో నర్సరీ పెంచుతున్నారని, ఆ స్థలం లోతట్టుగా ఉండడంతో వరదనీరు భారీగా నిలిచి ప్రహరీ కూలిందని తెలిపారు. దాంతో సుమారు రూ.4 లక్షల వరకు నష్టం వాటిల్లిందన్నారు.

నాయకుల పరామర్శ

హసనపర్తి: బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్‌ను మాజీ స్పీకర్ మధుసూదనాచారి, బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్, గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరి గౌడ్, రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమారస్వామి, బీసీ రాజ్యాధికార జిల్లా అధ్యక్షుడు రవి శనివారం పరామర్శించారు. సురేష్ తండ్రి దాసు రఘురాం ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ఆరె కటికలకు రిజర్వేషన్ కల్పించాలి

ఖిలా వరంగల్: వైన్స్ టెండర్లలో ఆరె కటికలకు 30శాతం రిజర్వేషన్ కల్పించాలని ఆరె కటిక పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి గోగికార్ రవీందర్ డిమాండ్ చేశారు. కరీమాబాద్‌లో శనివారం జరిగిన సమావేశంలో శివాజీ, కిషన్, సురేష్, శ్యాంబాబు, నాగరాజు, గణేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆ ఓట్లను తొలగించండి

హసన్‌పర్తి: గ్రామాల్లో ఉంటున్నట్లు అధికారులకు పక్కదారి పట్టించి పలువురు నగరంలో ఉంటూ పల్లెల్లో ఓటు నమోదు చేసుకోవడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. వారి ఓట్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించాలని వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఎంపీడీఓకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. హసన్‌పర్తి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో పలు పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

వైన్స్‌లో నగదు చోరీ

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలోని గణేష్ వైన్స్‌లో చోరీ జరిగింది. షట్టర్ తాళాలు ధ్వంసం చేసి రూ.5 వేల నగదు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు.